సాక్షి
అనకాపల్లి
బుధవారం ׀ 11 ׀ జూన్ ׀ 2025



లక్ష్మీపురంలో దాహం కేకలు..

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడంతో 5 వేల మందికి మంచినీటి సమస్య.. అయినా పట్టించుకోని అధికారులు.. 8లో

ఉష్ణోగ్రతలు

మంగళవారం

గరిష్ఠం/కనిష్ఠం

అనకాపల్లి : 30.3/24.2

జిల్లాలో రాగల ఐదు రోజుల్లో ఒక మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.



ఉపాధ్యాయ కౌన్సెలింగ్‌లో గందరగోళం

- తీవ్ర ఇబ్బంది పడ్డ టీచర్లు
- నేటికి వాయిదా

8లో

న్యూస్‌రీల్

ఇసుక ట్రాక్టర్ల యజమానులపై బైండోవర్ కేసులు


సాక్షి ఎఫెక్ట్..

దేవరాపల్లి: తిమిరాంలో భారీ గోతులు తీసి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్టు సాక్షి పత్రికలో ఈ నెల 9న 'ఇసుక తోడేళ్లు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. శారదానదిలో నిబంధనలకు విరుద్ధంగా గోతులు తీసి ఇసుక తరలిస్తున్న ముగ్గురు ట్రాక్టర్ యజమానులు సబ్బవరపు రామకృష్ణ, సీముసిరి గంగునాయుడు, గుంపాన గంగునాయుడులపై స్థానిక తహసీల్దార్ బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఉచిత ఇసుక పేరిట నిబంధనలను అతిక్రమించి ఇసుక తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పి.లక్ష్మీదేవి హెచ్చరించారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ల బదిలీ

విశాఖ లీగల్ : నగరంలోని పలువురు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ బి.రామకోటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. విజయనగరం మొబైల్ కోర్టు ఏపీపీ పి.శాంతి గౌతమి భీమిలి 16వ ప్రధాన శ్రేణి న్యాయస్థానం అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. పాడేరు మెజిస్ట్రేట్ కోర్టు ఏపీపీ వీ. రమేష్, భీమిలి 14వ ప్రథమ శ్రేణి మేజిస్ట్రేట్ కోర్ట్ ఏపీపీగా వస్తున్నారు. నగరంలోని ఒకటవ ప్రధాన మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు ఏపీపీ ఎం షణ్ముఖ ఎక్సైజ్ కోర్టు ప్రత్యేక ఏపీపీగా నియమితులయ్యారు. ఎక్సైజ్ కోర్టు ఏపీపీ కె విమల్ రాథోడ్, ఫస్ట్ ఏసీ ఎం కోర్టు ఏపీపీగా వస్తున్నారు.

తారస్థాయికి ఏసీబీ విచారణ!



ఒకవైపు నకిలీ ఏసీబీ అధికారి పేరుతో వసూళ్లు.. మరోవైపు సొంత శాఖలో కొద్ది మంది నెలవారీ ముడుపుల రాయుళ్ల కారణంగా విమర్శలు.. ఇలాంటి తరుణంలో ఉమ్మడి విశాఖ జిల్లా అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)కు అసలైన పరీక్ష ఎదురైంది. జిల్లాలోని పెందుర్తి దరి, వేపగుంటలో బినామీ 'రాజు'తో అక్రమ వ్యవహారాలు నడుపుతున్న ఓ సబ్‌రిజిస్ట్రార్ కేసు వచ్చింది. ఇక్కడి ఏసీబీపై నమ్మకం లేకపోవడంతో ఆధారాలతో సహా విజయవాడలోని ఏసీబీ కేంద్ర కార్యాలయానికి ఫిర్యాదు వెళ్లింది. విచారణ 'తార'స్థాయికి చేరాల్సిన తరుణంలో ఈ సమాచారాన్ని లీక్ చేసి, సబ్‌రిజిస్ట్రార్ అప్రమత్తమయ్యేలా సాయపడ్డారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- వేపగుంటలో భారీ వాణిజ్య భవంతి
- పక్కనే 500 గజాల స్థలం
- రూ.కోట్లలో కాజేసిన ఓ సబ్ రిజిస్ట్రార్
- బినామీ 'రాజు' పేరుతో వ్యవహారాలు
- ఆధారాలతో ఏసీబీ ప్రధాన కార్యాలయానికి ఫిర్యాదు
- ముందుగానే లీక్ చేసిన క్షేత్రస్థాయి సిబ్బంది?
- విశాఖ ఏసీబీ పనితనానికి సిసలైన పరీక్ష

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

జిల్లాలోని ఓ సబ్ రిజిస్ట్రార్‌కు వేపగుంటలో భారీ వాణిజ్య భవంతితో పాటు పక్కనే 500 చ.గ.ల ఖాళీ స్థలం ఉందని.. తన బినామీ రాజు పేరుతో అక్రమాలు సాగిస్తున్నాడంటూ ఏసీబీ ప్రధాన కార్యాలయానికి ఫిర్యాదు వెళ్లినట్టు సమాచారం. సదరు సబ్ రిజిస్ట్రార్ నిర్మించిన భారీ వాణిజ్య భవంతి ఫోటోలు, లీజు పేరిట ప్రకటించిన ఫోన్ నెంబర్‌తో పాటు, అతని బినామీ 'రాజు' వ్యవహారాలను కూడా అందించినట్లు తెలిసింది. స్థానిక ఏసీబీ బాస్ ముక్కుసూటిగా వ్యవహరిస్తారనే పేరున్నప్పటికీ... ఇక్కడే పాతుకుపోయిన కొద్ది మంది ఎస్ఐ, ఏఎస్ఐ, కానిస్టేబుళ్ల తీరుతో దర్యాప్తు సందర్భంగా సమస్యలొస్తున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇందుకు ఫిర్యాదుదారు స్థానికంగా ఫిర్యాదు చేయకుండా నేరుగా ప్రధాన కార్యాలయానికి ఫిర్యాదు చేయడమే నిదర్శనం. అయితే, **ఈ** ఆరోపణల ఆధారంగా లోతైన **దర్యాప్తు** చేసి... సదరు సబ్ రిజిస్ట్రార్‌ను **ఇరికిస్తారో?** 'మామూళ్లు'గా కేసు మూసేస్తారో? **తేలాల్సి ఉంది.**

విషయం లీకైంది?

సబ్‌రిజిస్ట్రార్ రంగ ప్రవేశంతో సాధారణ వ్యక్తులుగా వెళ్లిన ఏసీబీ సిబ్బందికి దిమ్మతిరిగి మైండ్ బ్లాంక్ అయినంత పనైంది. సదరు వాణిజ్య భవనానికి సంబంధించిన వ్యవహారాలన్నీ సబ్ రిజిస్ట్రార్‌కు చెందినవనే విషయం కూడా విచారణ బృందానికి తేటతెల్లమైంది. దీంతోపాటు ఈ వ్యవహారాలన్నీ బినామీ పేర్లతో సాగిస్తున్నారని స్పష్టమైంది. ఈ బినామీలకు ఉన్న లంకె కాస్తా ఏసీబీ అధికారులు ఛేదించాల్సి ఉంది. అయితే, విచారణ బృందంలోని కొందరు ఇప్పటికే సదరు సబ్ రిజిస్ట్రార్‌కు ఉప్పందించారనే ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంలో కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన ఫిర్యాదుపై ఎటువంటి నివేదిక ఇక్కడి నుంచి వెళ్తుందో చూడాలి.

రంగంలోకి సబ్‌రిజిస్ట్రార్!

ఇప్పటికే అందిన ఫిర్యాదుపై ఏసీబీ సిబ్బంది సదరు వాణిజ్య భవనాన్ని సందర్శించినట్లు తెలిసింది. అక్కడి నుంచే ఆ భవనం లీజుకు కావాలంటూ ఫోన్ ద్వారా వాకబు చేసినట్టు సమాచారం. లీజు మొత్తంపై ఆరా తీయగా చదరపు అడుగు(ఎస్ఎఫ్‌టీ)కు ఇంత మొత్తం అంటూ సమాధానం వచ్చింది. పార్కింగ్ ఇబ్బంది గురించి సందేహం వ్యక్తం చేస్తే.. తన సార్‌తో మాట్లాడాలంటూ మరో నెంబర్‌ను లీజు వ్యవహారాలు చూస్తున్న బినామీ వ్యక్తి, ఏసీబీ బృందానికి అందించారట. అప్పుడు రంగంలోకి ప్రవేశించారు సదరు సబ్ రిజిస్ట్రార్. **పక్కనే ఉన్న** 500 చదరపు గజాల స్థలం కూడా తనదేనని, కావాలంటే పార్కింగ్‌కు ఆ స్థలాన్ని వాడుకోవచ్చంటూ స్వయంగా వచ్చి, చూపించినట్లు ప్రచారం జరుగుతోంది.

పదేళ్లు నిండకుండానే.. సంపాదన రూ.100 కోట్లు

వాస్తవానికి సదరు సబ్ రిజిస్ట్రార్ సర్వీసు కాలం చాలా తక్కువే. చేరిన కొత్తలోనే మంచి ఫోకల్ ఏరియాలో పోస్టింగ్ రావడంతో ఆరంభం నుంచే దోపిడీ మొదలెట్టినట్లు సమాచారం. సర్వీసు కాలమంతా కలిపి పదేళ్లలోపు మాత్రమే ఉన్నా.. ఆస్తులు మాత్రం రూ.100 కోట్ల పైనే అని సమాచారం. తన బినామీ రాజుకు... ఈ సబ్ రిజిస్ట్రార్‌కు ఉన్న లింకులన్నీ వెలికితీసే పనిలో ఏసీబీ ఉంది. ఇంత తక్కువ సర్వీసు కాలంలో రూ.100 కోట్ల మేర ఆస్తులను ఎలా కూడబెట్టారనేది ఆయనతో పాటు సర్వీసులో చేరిన వారికీ అర్థం కావట్లేదు.

'తార'లు దిగిరావాల్సిందే!

ప్రధానంగా చిన్న చిన్న సమస్యలు ఉన్న భూముల రిజిస్ట్రేషన్‌తో పాటు సర్వే నెంబర్లను మార్చి రిజిస్ట్రేషన్ చేయడంలో సిద్ధహస్తుడు. ఒకవేళ ఎవరైనా అడిగినంత ఇవ్వకపోతే 'తార'లు దిగిరావాల్సిందేనని 'పేరు'. తన కార్యాలయంలో సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు ప్రతి కదలికనూ రికార్డు చేసేలా జాగ్రత్తలు తీసుకుంటాడు. అవసరమైన సమయంలో ఆ రికార్డులతోనే ఎదుటివారిని బెదిరించడంలో ఘనాపాటి. ఈ నేపథ్యంలోనే తమ పనికానిచ్చుకునేందుకు అడిగినంత ముట్టజెప్పుకుని బాధితులు మిన్నకుండిపోతున్నారని తెలుస్తోంది. మొత్తంగా ఇప్పటికే అనేక ఆరోపణలతో పరువుపోతున్న విశాఖ ఏసీబీ పనితనానికి ఈ కేసు లిట్మస్ పరీక్షగా మారనుందనడంలో సందేహం లేదు.

ముంచేసిన అధిక వడ్డీ ఆశ

రూ.కోటికి పైగా కుచ్చు టోపీ

- కార్లు తాకట్టు పెట్టి రూ.15ల వడ్డీకి అప్పు తీసుకున్న మోసగాడు
- రూ.కోటికి పైగా వెచ్చించిన బుచ్చెయ్యపేట యువకులు
- తెలంగాణ పోలీసులు రావడంతో మోసం బట్టబయలు
- అద్దెకు తీసుకున్న కార్లను తాకట్టు పెట్టినట్టు తెలుసుకొని లబోదిబో
- 30 కార్లను తీసుకుపోయిన తెలంగాణ పోలీసులు

బుచ్చెయ్యపేట: అధిక వడ్డీ ఆశతో బుచ్చెయ్యపేట మండల యువకులు నిలువునా మోసపోయారు. తెలంగాణకు చెందిన కార్లను తెచ్చి తాకట్టు పెట్టి యువకుల వద్ద కోటి రూపాయలకు పైగా దోచుకున్నారు. ఈ మోసంలో బుచ్చెయ్యపేట మండలం దిబ్బిడికి చెందిన ఓ రాజకీయ కుటుంబం సుమారు రూ.80 లక్షలు, నేతవానిపాలేనికి చెందిన ఒక యువకుడు రూ.20 లక్షలకు పైగా కోల్పోయినట్టు తెలుస్తోంది. మన్యం జిల్లా పార్వతీపురానికి చెందిన వ్యక్తి తెలంగాణ నుంచి కార్లను తీసుకొచ్చి వీరి వద్ద తాకట్టు పెట్టి డబ్బులు తీసుకెళ్లేవాడు. ఒక్కో కారు కుదువ పెట్టి మూడు, నాలుగు లక్షలు తీసుకునేవాడు. ఈ సొమ్ముపై లక్షకు నెలకు రూ.15 వేల వడ్డీ ఇచ్చేవాడు. అధిక వడ్డీకి ఆశపడిన వీరిద్దరూ తమ డబ్బులతోపాటు తమకు తెలిసిన వారి వద్ద నాలుగైదు రూపాయల వడ్డీకి డబ్బులు తెచ్చి మరీ కార్లు తాకట్టు పెట్టుకొని సొమ్ము ఇచ్చేవారు. అప్పు తిరిగి చెల్లించకపోయినా కార్లు తమ వద్దే ఉంటాయన్న ధీమాతో వారంతా కోటి రూపాయలకు పైగా ఇచ్చేశారు. నాలుగైదు రూపాయల వడ్డీకి అప్పు తెచ్చి, కార్లు తాకట్టు పెట్టుకొని 15 రూపాయల వడ్డీకి అప్పు ఇచ్చేవారు. నెలకు లక్ష వద్ద రూ.10 వేలు వడ్డీ మిగలడంతో వీరు లక్షలకు లక్షలు వెచ్చించారు.

కొనమెరుపు : పది రోజుల క్రితం తెలంగాణ పోలీసులు దిబ్బిడి వచ్చి యువకుల వద్ద తాకట్టు పెట్టిన కార్లను పట్టుకుపోయారు. వాటిని పార్వతీపురానికి చెందిన వ్యక్తి తమకు తాకట్టు పెట్టినట్టు వారు చెప్పినా పోలీసులు వినలేదు. తమ కార్లను లీజుకు తీసుకొని అప్పజెప్పలేదని తెలంగాణకు చెందిన కారు ఓనర్లు ఫిర్యాదు చేయడంతో, జీపీఎస్ ద్వారా ఇక్కడ కార్లు ఉన్నట్లు గుర్తించామని తెలంగాణ పోలీసులు వీరికి తెలిపారు. దొంగ కార్లను కొన్నందుకు మీపైనే కేసులు పెడతామని బెదిరించి 30 కార్లను పట్టుకుపోయారు. కార్లు తాకట్టు పెట్టిన పార్వతీపురానికి చెందిన వ్యక్తికి ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయామని వారికి అర్థమయింది. వారిద్దరికీ అప్పులిచ్చిన యువకులు తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో కూడా అనకాపల్లి మండలంలోని తుమ్మపాల గ్రామంలో కార్ల తాకట్టు పేరిట మోసం జరిగింది. బుచ్చెయ్యపేట మండలంలోని రాజాం, సీతయ్యపేట, చిట్టియ్యపాలెం తదితర గ్రామాల్లో కూడా ఇలాంటి మోసాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.



తాకట్టు పెట్టిన తెలంగాణ కారు

మహిళల కన్నెర్ర

- హోం మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్
- అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నేతల వినతి పత్రం

అనకాపల్లి టౌన్: అత్యాచారాలపై మహిళలు కన్నెర్ర చేశారు.. అరాచకాలు నశించాలని నినదించారు.. దిగజారిన శాంతిభద్రతలు కూటమి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం అనకాపల్లిలో నిరసన ప్రదర్శన జరిగింది. రింగ్‌రోడ్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా రైల్వేస్టేషన్ జంక్షన్ వద్దకు వెళ్లారు. అక్కడ ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, వినతిపత్రం అందజేశారు. పార్టీ అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకురాలు శోభ హైమావతి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పార్టీ జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత తదితర మహిళా నేతలు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. కూటమి పాలనలో మహిళలపై అత్యారారాలు పెరిగిపోయాయని, మూడు సంవత్సరాల పిల్లల నుంచి, ముసలివాళ్లకు కూడా రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రశాంతమైన రాష్ట్రం అత్యాచార ఆంధ్రప్రదేశ్‌గా మారిందన్నారు. రాష్ట్రంలో మహిళా హోం మంత్రి ఉన్నా అతివలపై దాడులను అరికట్టలేకపోతున్నారని విమర్శించారు. మహిళల రక్షణ కోసం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దిశ చట్టాన్ని అమలు చేస్తే.. దాని పేరు మార్చి మహిళలకు రక్షణ లేకుండా చేశారని విమర్శించారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వెంకట సత్యవతి, పార్టీ పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు కాండ్రేగుల హైమావతి, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షురాలు పంచారీ పద్మ, అనకాపల్లి మండల మహిళా అధ్యక్షురాలు కొట్నాల పద్మకుమారి, పెందుర్తి మహిళా విభాగం అధ్యక్షురాలు ఎస్.నదియా, అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం నాయకులు



ఇసుక దోపిడీని అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర గణేష్‌పై పోలీసుల రుబాబు

విద్వేషం.. విధ్వంసం

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన మరుక్షణం నుంచే కూటమి నేతలు, కార్యకర్తలు దాడులు, హత్యలు, దౌర్జన్యాలతో చెలరేగిపోతున్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, సానుభూతిపరులే లక్ష్యంగా తీవ్ర స్థాయిలో వేధింపులకు పాల్పడుతున్నా రు. రెడ్‌బుక్ పేరుతో టీడీపీ నేతలు, కార్యకర్తల దౌర్జనకాండకు హద్దుల్లేకుండా పోయింది. భౌతికదాడులు, ఆస్తుల విధ్వంసం విచ్చలవిడిగా కొనసాగుతోంది. ప్రశాంతతకు మారుపేరైన ఉమ్మడి విశాఖ జిల్లాలోని పల్లెల్లో వ్యక్తిగత విద్వేషాలు, దాడులు, అడ్డగోలు కేసులు, అరెస్టులు పెచ్చుమీరిపోయాయి.

- కూటమి ఏడాది పాలనలో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు, దౌర్జన్యాలు
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 100 మందిపై కేసులు, ఇద్దరిపై హత్యాయత్నం
- 11 మంది సోషల్ మీడియా యాక్టివిస్టులపై 44 అక్రమ కేసులు
- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల పంట నాశనం.. ఇళ్లు ధ్వంసం
- ఇసుక దోపిడీని అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యే పెట్ల గణేష్‌తోపాటు 44 మందిపై కేసులు

సాక్షి, అనకాపల్లి: హామీలు గాలికొదిలేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తల వేధింపులే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారు. ఆస్తులు విధ్వంసమైనా, ప్రాణాల మీదకు వచ్చినా.. ప్రతిపక్షం నుంచి వచ్చిన ఫిర్యాదు అంటే పోలీసులు పట్టించుకోవడం మానేశారు. ఏడాది కూటమి పాలనలో ఉమ్మడి విశాఖ జిల్లాలో 100 మందిపై కేసులు నమోదు చేశారు. ఇద్దరిపై హత్యాయత్నం చేశారు. 11 మంది సోషల్ మీడియా యాక్టివిస్టులపై 44 అక్రమ కేసులు పెట్టారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల పంటలు, ఇళ్ల ధ్వంసం చేశారు.

స్పీకర్ ఇలాకాలో దాడులు, దౌర్జన్యాలు..

సాక్షాత్తూ స్పీకర్ అయ్యన్నపాత్రుడి నియోజకవర్గమైన నర్సీపట్నంలో దాడులు, దౌర్జన్యాలు, హత్యాయత్నాలు ఎక్కువగా జరిగాయి. ఇసుక దోపిడీని అడ్డుకున్నందుకుగానూ మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌తోపాటు 44 మందిపై అక్రమ కేసులు బనాయించారు. కొద్ది రోజుల క్రితం వైఎస్సార్‌సీపీ యూత్ లీడర్ అల్లంపల్లి ఈశ్వర్రావుపై రౌడీలతో హత్యకు యత్నించారు. ఆయన అతి కష్టం మీద ప్రాణాలు దక్కించుకున్నారు. చిటికెల కన్నపై కేసు నమోదు చేసి ఆయన ఇళ్లను కూల్చేశారు. వైబీ పట్నానికి చెందిన చుక్కా రాంబాబుపై దాడి చేశారు. చీడిగొమ్మల గ్రామంలో టీడీపీ నేతలు దాడి చేయగా, 12 మంది వైఎస్సార్‌సీపీ యువతపై కేసులు నమోదు చేశారు. జూలై 9వ తేదీన మాకవరపాలెం మండలం రాశిపల్లి శివారు ఎరకన్నపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్ కొల్లి అప్పలనాయుడుపై 50 మందికి పైగా టీడీపీ గూండాలు కర్రలతో దాడి చేశారు. 2019లో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని మాకవరపాలెంలోని టీడీపీ కార్యకర్త లక్ష్మణ్‌ను వైఎస్సార్ సీపీ నేతలు మందలించారు. ఈ వీడియోను ఇటీవల ఒక టీడీపీ నేత ట్విట్టర్‌లో పెట్టి వైఎస్సార్‌సీపీ నేతలు రుత్తల సత్యనారాయణ, బండారు గాంధీ సర్పంచ్‌లు బొడ్డు గోవిందరావు, మాకిరెడ్డి అయ్యప్పలపై అక్రమ కేసులు పెట్టి అర్ధరాత్రి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనిపై న్యాయస్థానం మొట్టికాయలు పెట్టడంతో తోక ముడిచారు.

హోంమంత్రి నియోజకవర్గంలో..

పాయకరావుపేట నియోజకవర్గం కోటవురట్ల గ్రామం శివారు మర్రిచెట్టు ప్రాంతంలో మాడెం వరలక్ష్మి ఇంటి ముందు స్థలాన్ని ఆక్రమించేందుకు టీడీపీకి చెందిన జవ్వాది ఈశ్వరరావు, జవ్వాది రమేష్, బత్తుల అప్పారావు, బత్తుల నరసింహమూర్తి, పబ్బు తుర్రయ్య దాడి చేశారు. మహిళల దుస్తులు చింపి అసభ్యకరంగా దూషించారు. దాడి చేయడమే కాకుండా బాధిత మహిళలపై టీడీపీ వారు కేసులు కూడా పెట్టారు.



నాతవరం మండలం డి.ఎర్రవరంలో ధ్వంసమైన పంట



నర్సీపట్నం శారదానగర్‌లో వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్రి సత్యనారాయణ ఇల్లు ధ్వంసం చేస్తున్న దృశ్యం

సోషల్‌మీడియా యాక్టివిస్టులపై అక్రమ కేసులు

➡ విశాఖ తూర్పు నియోజకవర్గం మద్దిలపాలేనికి చెందిన వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ బోస రమణారెడ్డిపై వివిధ జిల్లాల్లోని పాదిలి, దర్శి, ఇచ్ఛాపురం, నీలకంఠాపురం, పార్వతీపురం పోలీస్‌స్టేషన్లలో ఆరు కేసులు నమోదు చేశారు. ఒక స్టేషన్ తర్వాత మరో స్టేషన్‌కు తిప్పి తీవ్రంగా వేధించారు. ఆయన డిసెంబర్ నెలలో విడుదలయ్యారు.

➡ విశాఖ జిల్లా గాజువాక మండలం గొల్లజగ్గరాజుపేటలో నివాసముంటున్న బోడి వెంకటేష్ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌లపై అభ్యంతరకర పోస్టులు పెట్టారంటూ మొత్తం 17 కేసులు నమోదు చేశారు. ఆయనను తొలుత 2024 నవంబర్ 3న అరెస్టు చేశారు. మొత్తం 115 రోజుల పాటు రిమాండ్‌లో ఉన్నారు. బాపట్ల జిల్లా మార్టూరు స్టేషన్‌లో సీఐ సీహెచ్ శేషగిరిరావు 15 నిమిషాల్లో 4 వేల గుంజీలు తీయమని ఇబ్బంది పెట్టారు. రాజాం, చినమేరంగి (కురుపాం), విశాఖలో దువ్వాడ, టూటౌన్, పరవాడ, సబ్బవరం, మహారాణిపేట, రేపల్లె, పెదకూరపాడు, పాత గుంటూరు, కృష్ణపట్నం, చీరాల, మార్టూరు, గుంటూరు, బాపట్ల, లావేరు, కర్నూల్, కడప, విజయవాడ, మైలవరం, మంచిలీపట్నంలలో కేసులు నమోదు చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అనకాపల్లిలో కండిషన్ బెయిల్ మంజూరు చేశారు. ఈ కేసులో మరో ముగ్గురు సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసులు నమోదు చేసి స్టేషన్ బెయిల్ ఇచ్చారు.

➡ విశాఖకు చెందిన సోషల్ మీడియా కార్యకర్త ఇంటూరి రవికిరణ్‌పై విశాఖలోనే కాకుండా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో మొత్తం 21 కేసులు నమోదు చేశారు. కేసులు, విచారణ అంటూ రెండు నెలలు పోలీసులు చిత్రహింసలకు గురిచేశారు. మొదట 2024 ఆగస్టు 31న పోలీసులు అరెస్టు చేశారు. అతని కుటుంబ సభ్యులు హైకోర్టుకు వెళ్లడంతో బెయిల్ లభించింది. మళ్లీ 2024 నవంబర్‌లో కొత్త కేసులు పెట్టి అరెస్టు చేశారు. విశాఖ సెంట్రల్ జైల్‌లో రిమాండ్‌లో ఉన్న సమయంలో బాపట్లలో కూడా మరో కేసు నమోదు చేశారు. దీంతో జైలు నుంచి నేరుగా బాపట్లకు తీసుకువెళ్లి విచారించారు. ఇలా అతడిపై రాష్ట్రంలో అనేక జిల్లాల్లో కేసులు పెట్టి వేధింపులకు గురిచేశారు. ప్రస్తుతం బెయిల్ మంజూరు చేశారు.

'భోజన పథకం బిల్లులు విడుదల చేయాలి'

అనకాపల్లి: రాష్ట్రవ్యాప్తంగా ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల బిల్లులు విడుదల చేయాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా కన్వీనర్ కోన లక్ష్మణ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. బిల్లులు, వేతనాలు చెల్లించకపోవడంతో పేద కార్మికులు అర్ధాకలితో అలమటిస్తున్నారని, మళ్లీ పాఠశాలలు ప్రారంభిస్తున్నా ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వంలో చలనం లేకపోవడం అన్యాయమన్నారు. వేతనాలు విడుదల చేయకపోతే వంట చేయడం సాధ్యం కాదని, భోజన పథకం పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా మారిందన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, విద్యార్థి మెస్ చార్జి కూడా పెంచాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో వంట చేయాలంటే తక్షణమే అన్ని రకాల బిల్లులు కార్మికుల ఖాతాలో జమ చేసి, వారి వేతనాలు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

నేడు అప్పన్నకు మూడో విడత చందనం సమర్పణ

సింహాచలం: జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారికి బుధవారం మూడో విడత చందన సమర్పణ కార్యక్రమం జరగనుంది. తెల్లవారుజామున అర్చకులు ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఇప్పటికే సిద్ధం చేసిన మూడు మణుగుల (సుమారు 125 కిలోలు) పచ్చి చందనంలో మంగళవారం వైదికులు పలు రకాల సుగంధ ద్రవ్యాలను కలిపి సమర్పణకు సిద్ధం చేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యులు, ఉప ప్రధానార్చకుడు సాతులూరి నరసింహాచార్యులు, అర్చకుడు అప్పాజీ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మూడో విడత చందన సమర్పణ కారణంగా బుధవారం అన్ని ఆర్జిత సేవలను రద్దు చేశారు.

వర్షాలతో ఈపీడీసీఎల్ అప్రమత్తం

విశాఖ సిటీ: భారత వాతావరణ శాఖ భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో, ఏపీఈపీడీసీఎల్ అప్రమత్తమైంది. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు సంస్థ వెల్లడించింది. ఈ మేరకు సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి అధికారులను అప్రమత్తం చేశారు. ఆయన ఆదేశాల మేరకు వినియోగదారులకు 24 గంటలు, 24/7 సేవలందించేందుకు కార్పొరేట్ కార్యాలయంతో పాటు సంస్థ పరిధిలోని 11 జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయాలు లేకుండా చూసేందుకు అవసరమైన యంత్రాంగాన్ని, పరికరాలను, సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని సూపరెంటెండింగ్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను సీఎండీ ఆదేశించారు. అధికారులందరూ వినియోగదారు లకు అందుబాటులో ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో సిబ్బందికి ఎటువంటి సెలవులు మంజూరు చేయవద్దని ఎస్ఈలకు సూచించారు. విద్యుత్ అంతరాయాలకు సంబంధించిన సమాచారాన్ని వినియోగదారులు కంట్రోల్ రూమ్ నంబర్లకు తెలియజేసి, సత్వర పరిష్కారం పొందవచ్చని ఏపీఈపీడీసీఎల్ ప్రకటించింది.

కంట్రోల్ రూమ్ నంబర్లు

కార్పొరేట్ ఆఫీస్	1912
విశాఖపట్నం	7382299975
అనకాపల్లి	9490610022
అల్లూరి సీతారామరాజు జిల్లా	9490610027

లక్ష్మీపురంలో దాహం కేకలు..

- 5వేల మంది గ్రామస్తుల మంచినీటి సమస్యను పట్టించుకోని అధికారులు
- లో ఓల్టేజీ సమస్యతో కాలిపోయిన 4 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- కరెంటు లేక వారం రోజులుగా నిలిచిన మంచినీటి సరఫరా
- నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు
- మంచినీటి కోసం గగ్గోలు పెడుతున్న జనం

చోడవరం : విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం ఆ గ్రామానికి మంచినీళ్లు లేకుండా చేసింది. మంచినీళ్ల కోసం లక్ష్మీపురం గ్రామ ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. 10 రోజులుగా ఈ గ్రామంలో కుళాయిల నుంచి మంచినీళ్లు రాక బిందెడు నీళ్ల కోసం బోర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ గ్రామంలో ప్రజలకు మంచినీళ్ల సమస్య ఉత్పన్నమైంది. చోడవరం మండలం లక్ష్మీపురం గ్రామంలో సుమారు 5వేల మంది జనాభా ఉన్నారు. కొద్ది నెలలుగా ఈ గ్రామంలో తీవ్ర లోఓల్టేజీ సమస్యతో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు ఒక్కొక్కటిగా కాలిపోతూ వచ్చాయి. గ్రామ పంచాయతీ సర్పంచ్, కార్యదర్శి అనేకసార్లు చోడవరం విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా వారు పట్టించుకోలేదు. తాజాగా మరో ట్రాన్స్‌ఫార్మర్ కూడా లో ఓల్టేజీ



నీరు పంపింగ్ కాక నిరుపయోగంగా ఉన్న మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంకు

సమస్యతో కాలిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్లు అన్నీ కాలిపోవడంతో విద్యుత్ సరఫరా లేక గ్రామంలో ఇంటింటి కుళాయిలకు మంచినీరు సరఫరా చేసే ట్యాంక్‌లకు బోర్ వెల్స్ నుంచి నీరు పంపింగ్ జరగలేదు. మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంక్‌లకు నీరు పంపింగ్ జరగకపోవడంతో గ్రామంలోకి కుళాయిల ద్వారా మంచినీరు సరఫరా నిలిచిపోయింది. బోర్‌వెల్స్ మోటార్లు కూడా కాలిపోవడంతో పంచాయతీ నుంచి వాటికి మరమ్మతులు చేయించారు. అయినా లోఓల్టేజీ కారణంగా పూర్తిగా ట్రాన్స్‌ఫార్మరే కాలిపోవడంతో పూర్తిగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీనిపై విద్యుత్ శాఖ అధికారులు కనీసం పట్టించుకోలేదు. ఎక్కువ ఖర్చుతో కూడిన పని అని ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రావాలంటూ జాప్యం చేసుకుంటూ వస్తున్నారే తప్ప ట్రాన్స్‌ఫార్మర్లు బాగుచేయించి లోఓల్టేజీ సమస్య నివారించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించే చర్యలు మాత్రం విద్యుత్ శాఖ అధికారులు చేపట్టడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడంతో సరఫరా లేక నీరు ఇవ్వలేదు. దీంతో మంచినీటి సమస్యతో లక్ష్మీపురం ప్రజలు అల్లాడుతున్నారు. బిందెడు నీళ్ల కోసం చేతిబోర్లు, వ్యవసాయ పంపుసెట్ల వద్దకు వెళ్లి నానా అవస్థలు పడుతున్నారు. వేలాది మంది ప్రజలు మంచినీటి కోసం కష్టాలు పడుతున్నా అధికారులు మాత్రం కనీసం స్పందించకపోవడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



లో ఓల్టేజీతో కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు

లో ఓల్టేజీ సమస్యతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని పదినెలలుగా విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. మంచినీటి ట్యాంక్‌కు నీరు పంపింగ్ చేసే ప్రదేశంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కూడా కాలిపోవడంతో కుళాయిల ద్వారా నీరు సరఫరా చేయలేదు. ఎంపీడీవోకి, విద్యుత్‌శాఖ ఏడీఈకి ఫిర్యాదు చేశాను. అయినా వారు చర్యలు తీసుకోలేదు. పంచాయతీ నుంచి ఏమీ చేయలేని పరిస్థితి. జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– శిరుచోళ్ల గంగాభవానీ గణపతినాయుడు, సర్పంచ్, లక్ష్మీపురం, చోడవరం మండలం

జిల్లాలో ఉపాధి బకాయిలు రూ. 243 కోట్లు

- వారం రోజుల్లోగా చెల్లించే అవకాశం
- 2 వేల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం
- జిల్లా డ్వామా పీడీ పూర్ణిమాదేవి

దేవరాపల్లి: జిల్లా ఉపాధి హామీ బకాయిలు ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రూ. 243 కోట్లు ఉన్నాయని దీనిలో ఉపాధి కూలీలకు వేతనాల రూపంలో రూ. 98 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ. 145 కోట్లు మేర చెల్లించాల్సి ఉందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా పీడీ) పథక సంచాలకులు ఆర్. పూర్ణిమాదేవి పేర్కొన్నారు బకాయిల చెల్లింపు ప్రక్రియ వారం రోజుల్లోగా జరుగుతుందన్నారు. ఈ మేరకు మండలంలోని మారేపల్లి-చేనులపాలెం గ్రామాల సమీపంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది 124 లక్షల పని దినాలు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 33 లక్షల పని దినాలు పూర్తి చేశామన్నారు. వర్షాకాలం ప్రారంభం కాక ముందే ఉపాధి పనిదినాల లక్ష్యాన్ని చేరుకోవడానికి చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలోని 24 మండలాల్లో 2వేల ఎకరాల్లో రైతులు ఎంపిక చేసుకున్న 25 రకాల ఉద్యాన పంటలను సాగు చేసేందుకు ప్రోత్సహిస్తున్నామన్నారు. గొయ్యి తవ్వి, మొక్క నాటిన నుంచి ఎదిగే వరకు మూడేళ్ల పాటు ఆర్థిక తోడ్పాటును అందిస్తామన్నారు. ఇప్పటి వరకు 1200 ఎకరాలను గుర్తించగా, మిగిలిన భూమిని జూలై నెలాఖరులోగా గుర్తిస్తామన్నారు. ఒక్కో పంట సాగుకు సుమారు రూ. 56 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు అయ్యే ఖర్చును మూడేళ్ల పాటు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. 7,600 పంట నీటి గుంతలు తవ్వాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకు 5,200 గుంతలు తవ్వడానికి అనుమతిని ఇచ్చామని తెలిపారు. ఆమె వెంట ఏపీడీ కె.శ్రీనివాసరావు, ఏపీవో వై. రుక్మిణీదేవి, ఈసీ కె. వెంకటేష్ ఉన్నారు.

బడి మానేసిన బాలికలకు ఓపెన్ స్కూల్లో ప్రవేశాలు

జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ సూర్యలక్ష్మి



మాట్లాడుతున్న జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ సూర్యలక్ష్మి

అనకాపల్లి : జిల్లాలో ఎక్కడైనా బాలికలు బడిమానేస్తే ఓపెన్ స్కూల్ ద్వారా చేర్పించడం జరుగుతుందని జిల్లా మహిళాశిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.సూర్యలక్ష్మి అన్నారు. బడిఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలన్నారు. స్థానిక శ్రీరామ్‌నగర్ మాధవసన్ హాల్లో జిల్లా స్థాయి కిశోర వికాసం వేసవి ప్రత్యేక శిక్షణ ముగింపు కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఈ ఏడాది మే 2 నుంచి జూన్ 10వ తేదీ వరకూ నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలో 11 నుంచి 18 ఏళ్ల బాల బాలికలను 20 మందిని ఒక గ్రూప్ చొప్పున చేసి వారికి 12 శిక్షణ కేంద్రాల ద్వారా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కిశోరి ఆరోగ్యం, విద్య, రక్షణ, బాల్య వివాహాల నివారణ తదితర అంశాలను వివరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి సీడీపీవో పి.ప్రభావతి, జిల్లా అదనపు ఎస్పీ ఎల్.మోహన్‌రావు, ఇన్‌చార్జ్ డీఎం అండ్‌హెచ్‌వో ఎం.బాలాజీ, డీఆర్‌డీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సాక్షి పత్రిక కార్యాలయాల మీద దాడులు తగవు

- అధికార పార్టీ ఆగడాలకు పరాకాష్ట
- సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని అరెస్టు అన్యాయం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి సుంకర శ్రీనివాసరావు ఖండన



మాడుగుల రూరల్ : రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో సాక్షి పత్రికా కార్యాలయాలపై టీడీపీ నేతలు, కార్యకర్తలు దాడులు చెయ్యడం అన్యాయమని జిల్లా వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, చోడవరం సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు ఒక ప్రకటనలో ఖండించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కక్ష సాధింపులు, రెడ్‌బుక్ పాలన, అక్రమ కేసులు బనాయించి గిట్టనివాళ్లను జైళ్లకు పంపడమే పనిగా పెట్టుకుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్న నేపథ్యంలో హామీల అమలు, వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికి ఇలాంటి దుష్ట సంప్రదాయానికి తెర దించిందన్నారు. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమన్నారు. జర్నలిస్టులను అక్రమంగా అరెస్టు చేయడం పత్రికా కార్యాలయాలపై దాడులు చేయడం ప్రజాస్వామ్యంలో హేయమైన చర్యని ఆయన తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలు, జర్నలిస్టులు, ప్రతిపక్ష పార్టీ నాయకులు మీద దాడులు చేయడం ప్రభుత్వానికి పరిపాటి అయిందన్నారు. ఇటువంటి దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు.

కారును ఢీకొన్న టిప్పర్ లారీ

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం కూడలిలో మంగళవారం పెద్ద ప్రమాదం తప్పింది. రోడ్డు ప్రమాదం నుంచి ముగ్గురు వ్యక్తులు ప్రాణహాని నుంచి అదృష్ట వశాత్తూ సురక్షితంగా బయట పడ్డారు. అయితే కారు మాత్రం దెబ్బతింది. అనకాపల్లి నుంచి యలమంచిలి వైపు వెళుతున్న కారును, అదే మార్గంలో వస్తున్న పెద్ద టిప్పర్ లారీ ఢీకొని సుమారు వంద మీటర్ల దూరం వరకు కారును ఈడ్చుకుంటూ ముందుకు వెళ్లిపోసాగింది. దాన్ని డ్రైవర్ గమనించలేదు. స్థానికులు గమనించి పరుగున వెళ్లి లారీ ఆపడంతో ప్రమాదం తప్పింది. అదృష్టవశాత్తూ కారు ఢీకొన్న తర్వాత బోల్తా పడకుండా సాధారణ స్థితిలో ముందుకు ఈడ్చుకు వెళ్లింది. దీంతోపాటు స్థానికులు గమనించి లారీ ఆపడంతో నిలిపారు. దీంతో ప్రమాదం తప్పింది. కారులో డ్రైవర్ సహా ముగ్గురు ప్రయాణిస్తున్నారు. కాకినాడ వద్ద ఉప్పాడకు చెందిన ప్రైవేటు వైద్యుడు హరనాథరాజు, భార్య మేరీమణి, బంధువు అయిన డ్రైవర్ యు. ప్రకాష్ ఉన్నారు. వీరు విశాఖ నుంచి ప్రస్తుతం నివాసం ఉంటున్న కాకినాడకు సొంత కారులో వెళుతుండగా ప్రమాదం జరిగింది. అదృష్టవశాత్తూ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి హాని జరగకపోవడంతో హమ్మయ్య..అంటూ ఊపిరి పీల్చుకున్నారు. మేరీమణి మాత్రం కొంత సేపు షాక్‌కు గురై అనంతరం తేరుకున్నారు. ప్రమాదంలో కారు కుడి పక్క భాగం దెబ్బతింది. ప్రమాదం వల్ల వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా పోలీసులు రోడ్డుకు అడ్డంగా తొలగించారు. ప్రమాద వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.



ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడిన వైద్యుడు హరనాథరాజు, మేరీమణి దంపతులు



తాళ్లపాలెం కూడలి వద్ద కారును ఢీకొని ముందుకు ఈడ్చుకుపోయిన టిప్పర్ లారీ

నెట్ సెంటరే సచివాలయం?

- తల్లికి వందనం వేలిముద్రకు రూ.30 చొప్పున వసూళ్లు
- అక్రమాలను ప్రోత్సహిస్తున్న కూటమి నేతలు
- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బాలాజీ ధ్వజం

ఎస్.రాయవరం : తల్లికి వందనం పథకానికి లబ్ధిదారులను నమోదు చేస్తామని రేవుపోలవరం గ్రామంలో ఓ ఇంటర్‌నెట్ దుకాణం వద్ద రూ.30 చొప్పున వసూలు చేసి వేలిముద్రలు వేయించుకుంటున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.బాలాజీ మంగళవారం తెలిపారు. సచివాలయం లాగిన్ ఇంటర్‌నెట్ సెంటర్‌లో ఓపెన్ చేసి గ్రామస్తులందరినీ పిలిపించి రూ.30 చొప్పున తీసుకుని అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సచివాలయం సిబ్బంది, సచివాలయాల్లో చేయాల్సిన పనులు ఇంటర్‌నెట్ సెంటర్‌లో చేయడం, పైగా నగదు వసూళ్లు చేయడం ఏమిటని ధ్వజమెత్తారు. స్థానిక కూటమి నేతలు ఈ రకమైన పనులను ప్రోత్సహించడం వల్ల సచివాలయ సిబ్బంది విధులకు సక్రమంగా హాజరుకాకపోవడమే కాకుండా పనులు పక్కదారి పడుతున్నాయన్నారు. ఈ సమస్యను మండల అధికారులు దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకోలేదని విమర్శించారు. దీనిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పారు.



రేవుపోలవరంలో నెట్ దుకాణం వద్ద తల్లికి వందనం వేలిముద్ర కోసం గుమిగూడిన మహిళలు

ఏఐ సాంకేతికతతో ప్రపంచ అవసరాలు కొత్తపుంతలు

ఐజీఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మోహన్ అగర్వాల్



ఐఐఏఎం ఫ్యాకల్టీతో అగర్వాల్, ఇతర అధికారులు

ఎంవీపీ కాలనీ: మేనేజ్‌మెంట్ విద్యావిధానంలో అంతర్జాతీయ ఎక్స్‌పోజర్, మార్కెటింగ్ వ్యూహాలు, సర్వీస్ మార్కెటింగ్‌లో ప్రపంచ విధానాలపై స్థానిక ఐఐఏఎం బిజినెస్ స్కూల్ వేదికగా ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఇండో గల్ఫ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఐజీఎంఏ) అధ్యక్షుడు డాక్టర్ మోహన్‌లాల్ అగర్వాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. సర్వీస్ మార్కెటింగ్ విద్యను అభివృద్ధి చేయడానికి అంతర్జాతీయంగా ఉన్న అవకాశాలను వివరించారు. ఏఐ సాంకేతికతతో ప్రపంచ అవసరాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయన్నారు. మేనేజ్‌మెంట్ విద్యపై సైతం ఆధునిక సాంకేతికత ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచంలోని ఇండస్ట్రియల్, సాంకేతిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. అనంతరం సర్వీస్ మార్కెటింగ్‌లో ప్రపంచ విధానాలు, అంతర్జాతీయ అవకాశాలను విద్యావిధానానికి అనుసంధానం చేయడం, వివిధ సర్వీస్ క్లస్టర్లను ఏకీకృతం చేయడం వంటి అంశాలపై చర్చించారు. తొలుత ఐఐఏఎం ఫ్యాకల్టీతో ఇంటరాక్షన్ సెషన్‌ను సంస్థ డీన్ డాక్టర్ సుంకరి రవీంద్ర ప్రారంభించారు. కార్యక్రమంలో ఐఐఏఎం బీస్కూల్ ఫ్యాకల్టీ, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

- ఏడాది పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదు
- సూపర్ సిక్స్ వెంటనే అమలు చేయాలి
- నాతవరంలో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన



కూటమి ప్రభుత్వం తీరుకు నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

నాతవరం : కూటమి నేతలు ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను యుద్ధ ప్రతిపాదికన అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం కూటమి ప్రభుత్వం ఏడాది పాలన సందర్భంగా ఆందోళన చేపట్టారు. మెయిన్‌రోడ్డుపై ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికలు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఏళ్ల తరబడి గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. అర్హత కలిగిన రైతులందరికీ రైతు భరోసా అందించాలన్నారు. తల్లికి వందనం, 50 ఏళ్లు దాటిన అందరికీ పింఛన్ల సదుపాయం కల్పించాలని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ఇతర సదుపాయాలు అమలు చేయాలన్నారు. పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజనులపై అటవీశాఖ అధికారులు కేసులు పెట్టడం అపాలన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగంపై కాకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రం తహసీల్దార్ ఎ.వేణుగోపాల్‌కు ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు గురుబాబు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు గంగాభవాని, మండల శాఖ అధ్యక్షుడు చిన్నంనాయుడు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

వాల్తేర్ లోకోకు రెండో స్థానం

తాటిచెట్లపాలెం (విశాఖ): ఇటీవల బనారస్ లోకోమోటివ్ వర్క్స్ లో నిర్వహించిన 'బ్యూటీ కాంటెస్ట్ ఫర్ ఎలక్ట్రికల్ లోకోమోటివ్స్' పోటీలలో విశాఖ ఎలక్ట్రికల్ లోకో షెడ్‌కు ద్వితీయ స్థానం లభించింది. వాల్తేరు డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా నేతృత్వంలో సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ బి. షణ్ముఖరావు పర్యవేక్షణలో విశాఖపట్నం ఎలక్ట్రికల్ లోకో షెడ్ సిబ్బంది ఈ విజయాన్ని సాధించారు. వారు డబ్ల్యూ ఏపీ -7 లోకోమోటివ్ 37419 ను ఆధునీకరించి, అనేక అధునాతన సౌకర్యాలతో పోటీలలో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా మొత్తం 13 లోకోలు ఈ పోటీలలో పాల్గొనగా, విశాఖపట్నం ఎలక్ట్రికల్ లోకో షెడ్ ఆధునీకరించిన లోకోకు రెండో స్థానం దక్కింది. వాల్తేరు డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా ఎలక్ట్రికల్ లోకో షెడ్ సిబ్బంది, అధికారులను అభినందించారు.

గంజాయి కేసులో పదేళ్ల జైలు శిక్ష

తాటిచెట్లపాలెం (విశాఖ): గవర్నమెంట్ రైల్వే పోలీసు (జీఆర్పీ)ల తనిఖీల్లో అరెస్టయిన గంజాయి అక్రమ రవాణా కేసులో ప్రధాన నిందితుడికి విశాఖపట్నం మెట్రో పాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టు శిక్ష విధించింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. 2014లో గంజాయితో పట్టుబడ్డ ప్రధాన నిందితుడు కొర్ర ప్రశాంత కుమార్‌కు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధించారు. కేసును ప్రభుత్వ న్యాయవాది ప్రసాద్ నేతృత్వంలో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ నాయుడు, కోర్టు హెడ్ కానిస్టేబుల్ జి.వెంకటేశ్వర్రావు నిరంతర పర్యవేక్షణలో బలమైన ఆధారాలు సమర్పించడంతో న్యాయస్థానం నిందితుడికి శిక్ష విధించింది.

జీవీఎంసీలో పలువురికి బదిలీలు

అల్లిపురం: జీవీఎంసీలో పలువురు అధికారులకు మంగళవారం సాయంత్రం బదిలీలు జరిగాయి.

అధికారి	హోదా	ప్రస్తుతం పనిచేస్తున్న స్థానం	బదిలీ అయిన స్థానం
కె. చక్రవర్తి	సహాయ సంచాలకులు	వ్యవసాయ శాఖ (విశాఖ)	జీవీఎంసీ జెడ్‌సీ (అనకాపల్లి)
శాంతకుమారి	స్పెషల్ గ్రేడ్ కమిషనర్	వెయిటింగ్	జీవీఎంసీ ఉప పథకం అధికారి యూసీడీ.
ఎల్.సురేష్	గ్రేడ్-2 కమిషనర్	జీవీఎంసీ డీపీఓ	సీడీఎంఏకు రిపోర్టు
పీపీపీ వాణి	స్పెషల్ గ్రేడ్ కమిషనర్	వెయిటింగ్	జీవీఎంసీ ప్రాజెక్టు అధికారి
టీటీ రత్నకుమార్	గ్రేడ్-2, కమిషనర్	జీవీఎంసీ పీఓ	సీడీఎంఏ రిపోర్టు
బంటు సన్యాసినాయుడు	ఆడిట్ అధికారి	ఆడిట్ ఆఫీసర్ (విజయనగరం)	జీవీఎంసీ పీఓ
మణికుమార్	ఉప కార్యనిర్వాహక ఇంజనీరు	విజయనగరం	జీవీఎంసీ
కేజీఎన్ నరిసింగరావు	ఉపకార్యనిర్వాహక ఇంజనీరు	జీవీఎంసీ	విజయనగరం
టి.రాయల్‌బాబు	కార్యనిర్వాహక ఇంజనీరు	విజయనగరం	జీవీఎంసీ
సీపాన జయరాం	పశువైద్యాధికారి	జీవీఎంసీ వెటర్నరి అధికారి	సాలూరు కమిషనర్
కేవీ సత్యనారాయణ	సహాయ ఇంజనీరు	జీవీఎంసీ	శ్రీకాకుళం కార్పొరేషన్
వైపీఆర్ కిరణ్	సహాయ ఇంజనీరు	శ్రీకాకుళం కార్పొరేషన్	జీవీఎంసీ
ఎం.సత్యనారాయణ	సహాయ ఇంజనీరు	జీవీఎంసీ	ఇచ్ఛాపురం మున్సిపాలిటీ
ఎస్.రవికుమార్	సహాయ ఇంజనీరు	విజయనగరం కార్పొరేషన్	జీవీఎంసీ
వి.అలేఖ స్వామి	సహాయ ఇంజనీరు	జీవీఎంసీ	సాలూరు
శ్రీరంగం రవి కుమార్	సహాయ ఇంజనీరు	బొబ్బిలి	జీవీఎంసీ
పి.తులసి	సహాయ ఇంజనీరు	జీవీఎంసీ	నర్సీపట్నం
పి.గణేష్	సహాయ ఇంజనీరు	నర్సీపట్నం	జీవీఎంసీ

ఉపాధ్యాయ కౌన్సెలింగ్‌లో గందరగోళం

- తీవ్ర ఇబ్బంది పడ్డ టీచర్లు
- కనీస ఏర్పాట్లు కరువు
- అధికారులను నిలదీసిన ఉపాధ్యాయులు
- సాంకేతిక లోపం అంటూ నేటికి కౌన్సెలింగ్ వాయిదా

ఆరిలోవ: ఉమ్మడి విశాఖ జిల్లాల సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ) బదిలీలకు సంబంధించి మంగళవారం నిర్వహించాల్సిన మాన్యువల్ కౌన్సెలింగ్ గందరగోళంగా మారింది. కొన్ని రోజులుగా ధర్నాలు, నిరసనలతో తమ సమస్యలను వినిపించిన ఎస్జీటీలకు కౌన్సెలింగ్ ప్రక్రియ తీవ్ర అసౌకర్యాన్ని కలిగించింది. విద్యాశాఖ అధికారులు సరైన సౌకర్యాలు కల్పించకపోవడం, కౌన్సెలింగ్‌లో తీవ్ర జాప్యం జరగడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన ఈ కౌన్సెలింగ్‌కు అర్హులైన 1 నుంచి 500 మంది ఉపాధ్యాయులను పిలవగా, వారంతా మధ్యాహ్నం 2 గంటలకే హాజరయ్యారు. అయితే కౌన్సెలింగ్ ప్రక్రయ గంటల తరబడి ఆలస్యమవుతూ వచ్చింది. దీంతో సహనం కోల్పోయిన ఉపాధ్యాయుల్లో గందరగోళం నెలకొంది. అధికారులను నిలదీశారు. కౌన్సెలింగ్ జరుపుతారా లేదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు సాంకేతిక లోపం తలెత్తిందని పేర్కొంటూ కౌన్సెలింగ్‌ను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు రాత్రి 9 గంటలకు ప్రకటించారు. అప్పటివరకు నిరీక్షించిన ఉపాధ్యాయులు ఈ ప్రకటనతో తీవ్ర నిరాశకు గురయ్యారు. కనీసం హాజరైన ఉపాధ్యాయులకు కూర్చోవడానికి కుర్చీలు కూడా ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. దూర ప్రాంతాల నుంచి చంటి పిల్లలతో సహా హాజరైన కొందరు ఉపాధ్యాయులు రాత్రివేళ తీవ్ర అవస్థలు పడ్డారు. నగరానికి దగ్గరగా ఉన్నవారు ఇళ్లకు చేరుకోగా, దూర ప్రాంతాల నుంచి వచ్చినవారు వసతి కోసం ల్యాడ్జీలను వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బుధవారం ఉదయం 9 గంటలకు 1 నుంచి 300 మందికి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని అధికారులు ప్రకటించారు. అయితే విద్యాశాఖ అధికారులు కావాలనే ఇబ్బంది పెడుతున్నారంటూ ఉపాధ్యాయుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. బుధవారం జరగాల్సిన కౌన్సెలింగ్ అయినా సక్రమంగా జరుపుతారో లేదో అని ఆందోళన వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయులు నిరాశతో వెనుదిరిగారు.

క్లుప్తంగా

జోనల్ కమిషనర్‌గా చక్రవర్తి



అనకాపల్లి టౌన్: జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్‌గా కె. చక్రవర్తి నియమితులయ్యారు. విశాఖపట్నం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడిగా విధులు నిర్వహిస్తున్న ఈయనను డిప్యూటేషన్‌పై జోనల్ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన రెండు మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరిస్తారని కార్యాలయ వర్గాలు తెలిపాయి.

రాయితీపై వరి విత్తనాలు సిద్ధం

తుమ్మపాల: ఖరీఫ్–2025 సాగుకు సంబంధించి వివిధ రకాల వరి విత్తనాలు రాయితీపై రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి పి.రంగాచారి తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఈ నెల 11 నుంచి రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకుని, రాయితీ పోను మిగిలిన నగదు చెల్లించాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డ్ జెరాక్స్ సమర్పించి విత్తనాలు పొందాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్‌తోపాటు చిన్నారులు

అనకాపల్లి: బడి ఈడు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించే విధంగా టీచర్లు, ఆయాలు కృషి చేయాలని సర్పంచ్ జెర్రిపోతులు లక్ష్మి తెలిపారు. మండలంలో గోపాలపురం సచివాలయం వద్ద కిశోర వికాసం–వేసవి సెలవుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికలపై వారి తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి యోగా పోటీలు



యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు

అనకాపల్లి: స్థానిక గాంధీనగరం ఎస్ఆర్ శంకరన్ హాల్లో జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యోగా నోడల్ అధికారులు ఎల్.రమణ, కె.లావణ్య తెలిపారు. ఈ నెల 14వ తేదీ వరకూ జిల్లాలో వివిధ విభాగాల్లో యోగా పోటీలు జరుగుతాయని చెప్పారు. 10 నుంచి 18 సంవత్సరాలు కలిగిన బాలబాలికలకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ఎంపికైన వారిని త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. అంతకుముందు విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో యోగా జిల్లా మెంబర్లు జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావునాయుడు, ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.ప్రసాద్ పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 53 దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	- - - -	- - - -
రెండో రకం	3,690	4,000
మూడో రకం	3,250	3,610

అనకాపల్లి సినిమాలు

రాజా	: భైరవం
సత్యనారాయణ స్క్రీన్-1	: గ్యాంబ్లర్స్
సత్యనారాయణ స్క్రీన్-2	: 007
పర్తిసాయి	: ఖలేజా
షిర్డీసాయి	: థగ్ లైఫ్
వెంకటేశ్వర	: రాజావారు
శ్రీ సత్య	: శుభం
రామచంద్ర	: పాడేరు 12వ మైలు

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 48 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–15 యూనిట్లు, బీ పాజిటివ్–6, ఓ పాజిటివ్–22, ఏబీ పాజిటివ్–5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యూ లోకేష్‌ను (9703619706) సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 356 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 294 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924–223595 నంబరును సంప్రదించవచ్చు.

నేరేడు.. పోషకాలు మెండు

కాయ నుంచి చెట్టు బెరడు వరకూ ఔషధ గుణాలు

సర్వరోగ నివారిణిగా ప్రసిద్ధి

పండ్లకు మార్కెట్లో డిమాండ్



చెట్టుకు వేలాడుతున్న నేరేడు పండ్ల గుత్తు

తుమ్మపాల: నోరూరించే నేరేడు పండ్ల సీజన్ వచ్చేసింది. ఎన్నో పోషక ప్రయోజనాలు ఉన్న వీటిని తినడానికి కొంచెం తియ్యగా, వగరుగా ఉంటాయి. రక్తాన్ని శుద్ధి చేయడంతోపాటు ఔషధ గుణాలు ఎక్కువగా ఉండటంతో వీటిని సర్వరోగ నివారిణిగా భావిస్తారు. ఈ పండ్లను ఆయుర్వేదంలో ఆపర సంజీవనిగా చెబుతారు. ఈ పండ్లలో విటమిన్ ఎ, సి అధికంగా ఉంటాయి. నేరేడు సీజన్ ప్రారంభం కావడంతో మార్కెట్లో విరివిగా లభిస్తున్నాయి. గ్రామాల్లో సైతం పిల్లలు నేరేడు చెట్ల వద్దకు వెళ్లి పండ్లను తింటూ వేసవి సెలవులను ఎంజాయ్ చేస్తున్నారు.

◆ హైబ్రిడ్ రకానికి మరింత గిరాకీ...

నేరుడులో నాటు పండ్ల కంటే హైబ్రిడ్ రకానికి గిరాకీతోపాటు ధర ఎక్కువే. ఉమ్మడి జిల్లాలో గ్రామీణ వాణిజ్య కేంద్రంగా ఉన్న అనకాపల్లి మార్కెట్‌కు నేరేడు పండ్లు చేరడంతో ఇప్పుడిప్పుడే డిమాండ్ పెరుగుతుంది. గ్రామాల్లో పండే నాటు పండ్లు ప్రస్తుతం కేజీ రూ.150 నుంచి రూ.170 వరకు ఉంటే, హైబ్రిడ్ రకం కేజీ రూ.250 వరకు ధర పలుకుతోంది. తక్కువ మోతాదులో 1/4 (పావు కిలో) మాదిరి కొనుగోలు చేస్తే రూ.80 వరకు, 1/2 అర కిలోకు రూ.150 ధర ఉంది. కరోనా తర్వాత గడిచిన రెండేళ్లలో నేరేడు పండ్లను తినే వారి సంఖ్య పెరిగింది.

◆ పలు వ్యాధుల నివారణకు దోహదం

మధుమేహం, రక్తహీనత, బీపీ, కిడ్నీ సమస్యలతోపాటు ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులతో సతమతమయ్యే వారికి నేరేడు పండ్లు రోగ నివారణగా పనిచేస్తాయి. రోగాలుతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ లక్షల్లో ఫీజులు చెల్లిస్తూ జేబులు గుల్ల చేసుకుంటున్న వారికి ఈ పండు ఉచిత వైద్యంగా ప్రసిద్ధి చెందింది. సహజ సిద్ధంగా పండే నేరేడు పండ్లలోని ఔషధ గుణం పలు రకాల దీర్ఘకాలిక వ్యాధులకు మందులతో పని లేకుండా మంచి ఫలితాన్ని ఇస్తుంది.

పోషకాలు, ఉపయోగాలు.

◆ శరీర భాగాల్లో గాయాలైతే నేరేడు ఆకులను కట్టుగా కడితే రక్తం కారకుండా నిలుపుదల చేయవచ్చు.

◆ మూత్రాశయ సమస్యలకు నేరేడు ఓ టానిక్‌లా పనిచేస్తుంది. మూత్రం రాక ఇబ్బంది పడే వారికి ఉపయోగపడుతుంది.

◆ నేరేడు చెట్టు ఆకులు విషాన్ని సైతం పీల్చుకొనే గుణాన్ని కలిగి ఉంటాయి.

◆ పొట్టలో ఉండే నులిపురుగులను నేరేడు నివారిస్తుంది. నోటి క్యాన్సర్ నివారణకు నేరేడు పండ్లు ఎంతగానో దోహదపడతాయి.

◆ మధుమేహ వ్యాధిగ్రస్తులకు నేరుడు పండు ఒక వరం. గింజలను పొడిచేసుకొని రోజూ వాటిని నీటిలో మరగబెట్టి, వడకట్టి తాగితే శరీరంలో చక్కెర నిల్వలు అదుపులో ఉంటాయి.

◆ నోటిపూత, చిగుళ్ల వ్యాధులు, దంత క్షయంతో బాధపడేవారు నేరేడు ఆకుల రసాన్ని రోజూ పుక్కలిస్తే ఉపశమనం కలుగుతుంది.

◆ నోటి పూత వచ్చినప్పుడు రెండు, మూడు నేరేడు పండ్లను తింటే వెంటనే మంట, బాధ నుంచి విముక్తి కలుగుతుంది.

◆ అతిసార రోగులకు సైతం ఈ పండ్లు ఔషధంగా పనిచేస్తాయి.

◆ గర్భిణులు నేరేడు పండ్లను తినకూడదని నిపుణులు చెబుతున్నారు.

నేరేడు ఆరోగ్యానికి మేలు



నేరేడు పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ పండ్లకు విషాన్ని హరించే శక్తి ఉంది. శస్త్ర చికిత్సలు అందుబాటులో లేని రోజుల్లో వైద్యానికి నేరేడు బెరడు, కాయలు, ఆకులను ఎక్కువగా వినియోగించేవారని సమాచారం. మధుమేహం, రక్తహీనత, బీపీతోపాటు పలు దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు ఇవి ఔషధంగా పనిచేస్తాయి. సీజన్‌లో పండే నేరేడును శుభ్రపరచుకుని తినవచ్చు.

– డాక్టర్ డి.డి.నాయుడు, ప్రైవేటు వైద్యుడు, అనకాపల్లి

వెద సాగుకు విత్తన ఎంపిక కీలకం



శాస్త్రవేత్తల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి: రానున్న వర్షాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని, వెద సాగుకు అనుకూలమైన ఎంటీయూ 1262, 1318, 1224 వంటి వరి రకాలను ఎంపిక చేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శాస్త్రవేత్తలతో ఆయన మాట్లాడారు. వరి కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బెండజింతో విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలన్నారు. కలుపు సమస్య ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున విత్తిన రెండు రోజుల్లోపు పెండిమిథాలిన్ 700 మి.లీ.ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వరి నారుమళ్లు వేసుకోవడానికి నేలను దున్ని తయారు చేసుకుని విత్తనం సేకరించుకోవాలన్నారు. సజ్జ, కొర్ర వేసే రైతులు అనుకూలమైన రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. వాతావరణ పరిస్థితులకు, చెరకు పైరులో మొవ్వ కుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉందన్నారు. నివారణకు కార్బెండిజిమ్ ఒక గ్రాము లేదా మాంకోజెట్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి వర్షాల అనంతరం పిచికారీ చేయాలన్నారు. చెరకులో పేనుబంక ఉధృతి పెరిగే అవకాశం ఉందని, నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి వర్షాల అనంతరం పిచికారీ చేయాలన్నారు. వర్షాలను వినియోగించుకుని కూరగాయ, తీగ జాతి కూరగాయ పంటలను వేసుకోవాలని సూచించారు. అరటిలో సిగటోక తెగులు ఆశించి, అధిక వర్షాలకు వ్యాపించే అవకాశం ఉందన్నారు., నివారణకు ప్రోపికొనజోల్ 0.1శాతం లీటరు నీటికి కలిపి వర్షాల అనంతరం పిచికారీ చేయాలన్నారు. భూమిలో అధిక తేమ వల్ల అరటి దుంపలు కుళ్లిపోకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి దుంప చుట్టూ తడిచే విధంగా పోయాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వి.గౌరి, బి.భవాని, సీతారామలక్ష్మి, వి.చంద్రశేఖర్, పి.వి.పద్మావతి, ఎ.అలివేణి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్ వారిదే..



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి

కశింకోట: కౌమార వయస్సు పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద కల్యాణ మండపంలో మంగళవారం కిశోర వికాసం వేసవి ప్రత్యేక శిక్షణ ముగింపు సందర్భంగా నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. కౌమార వయస్సు పిల్లల ఆరోగ్యం కాపాడటానికి, ఆత్మ విశ్వాసం పెంపొందించడానికి అంతా సమష్టి కృషి చేయాల్సి ఉందన్నారు. ఏఎస్ఐ కె. రమణమ్మ మాట్లాడుతూ ఉన్నత విద్యను ప్రోత్సహించి బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం. ఝాన్సీ రాణి మాట్లాడుతూ కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. రక్త హీనతకు గురికాకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. టీడీపీ మహిళా అధ్యక్షురాలు పి. కల్యాణి, పంచాయతీ కార్యదర్శి ఎస్. రామచంద్రరావు, మహిళా పోలీస్ జయభారతి, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యపై జీవీఎంసీలో ప్రస్తావిస్తా



ఉమ్మలాడ రహదారిలో డ్రైనేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ మందపాటి సునీత

అనకాపల్లి: ఉమ్మలాడ రహదారిలో నూతనంగా డ్రైనేజీ నిర్మించి, అక్కడ ప్రజల సమస్యను పరిష్కరించేందుకు నిధులు కోసం జీవీఎంసీ సమావేశంలో ప్రస్తావిస్తానని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత తెలిపారు. ఉమ్మలాడ రహదారిలో డ్రైనేజీ వ్యవస్థను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మలాడ రహదారిలో డ్రైనేజీ సమస్యను అక్కడ ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. డ్రైనేజీలో పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో తక్షణమే శుభ్రం చేయాలని జీవీఎంసీ శానిటరీ సిబ్బందికి సూచించారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో స్థానిక పూడిమడక జాతీయ రహదారిలో మహానేత రాజశేఖర్‌రెడ్డి విగ్రహం సమీపంలో రహదారి, డ్రైనేజీ సమస్యను రూ.50 లక్షలతో పరిష్కరించామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, వార్డు మాజీ కౌన్సిలర్ దాడి భోగలింగేశ్వరరావు, స్థానికులు గొన్న బత్తుల రమణ, పొలమరశెట్టి ఓంనమఃశివాయ, మళ్ల స్వామి, గైపూర్ రాజు, జీవీఎంసీ శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల అభివృద్ధి

'పల్లె పిలుస్తోంది రా.. కదలి రా..'లో ఎమ్మెల్యే కొణతాల



యోగాసనాలు వేస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



కుర్చీలాట ఆడుతున్న మహిళలు

కశింకోట: ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. నియోజకవర్గంలోని తొలిసారిగా మండలంలోని సోమవరం గ్రామంలో మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించే 'పల్లె పిలుస్తోంది రా.. కదలి రా..' కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చుదిద్దుతామన్నారు. అనకాపల్లి మండలం చింతనిప్పుల అగ్రహారం గ్రామాన్ని ఆదర్శవంతం చేస్తామన్నారు.

రానున్న నాలుగేళ్లలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యాలయంలో సోమవారం రాత్రి పల్లె నిద్ర చేశారు. మంగళవారం ఉదయం యోగాసనాలు వేశారు. రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ బి. మోహనరావు మాట్లాడుతూ కౌలు రైతులకు కార్డులు, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కింద పెట్టుబడి సాయం అందివ్వడానికి అర్హుల జాబితాను ప్రభుత్వానికి నివేదించి చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా పశు వైద్య శాఖ అధికారి బి. రామమోహనరావు మాట్లాడుతూ సోమవరం గ్రామానికి ఈ ఏడాది పాడి పశువులకు లింగ నిర్ధారణ వీర్యాన్ని ఉచితంగా అందజేస్తామన్నారు. సాధారణంగా రూ.500 ఇందుకు రైతు వాటాగా భరించాల్సి ఉంటుందని, అయితే దీన్ని చెల్లించకుండా అందిస్తామన్నారు. దీనివల్ల ఇక్కడ 400 పశువులకు ఉపయోగకరమన్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళలకు కుర్చీలాట, పురుషులకు షటిల్ బాడ్మింటన్ ఆటలు నిర్వహించారు.

మూలకు చేరిన వాటర్ ప్లాంట్



నాలుగు రోడ్ల జంక్షన్ బస్టాప్ పక్కనే పనిచేయని మినీ మినరల్ వాటర్ ప్లాంట్

అనకాపల్లి టౌన్: పట్టణంలోని నాలుగు రోడ్ల జంక్షన్‌లో బస్టాప్ పక్కన్న ఏర్పాటు చేసిన మినీ మినరల్ వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా మారింది. జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా ఈ ప్లాంట్ నిలుస్తుంది. పట్టణానికి చెందిన మార్వాడీ శ్రీవిష్ణు సేవా సంఘం వారు లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి ప్రజల దాహర్తిని తీర్చేందుకు 2022లో దీన్ని ఏర్పాటు చేశారు. అప్పటి జోనల్ కమిషనర్ కె. కనకమహాలక్ష్మి ప్రారంభించారు. దీని నిర్వహణ జీవీఎంసీకి అప్పగించారు. బస్టాప్ పక్కన ఉన్న ఈ ప్లాంట్ వేలాది మందికి మంచినీటి అవసరాలను తీర్చేది. కొద్ది రోజులు మాత్రమే ఇది పనిచేసింది. తర్వాత కాలంలో రిపేర్‌కు గురవ్వడంతో ప్లాంట్ నిర్లక్షానికి గురైంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు దృష్టి సారించి వాటర్ ప్లాంట్‌ను వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

అప్పన్నకు నిత్య కల్యాణం



స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేష వస్త్రాలు అందజేశారు.

ఏయూ మోడల్ కెరీర్ సెంటర్‌లో నేడు ఇంటర్వ్యూలు

మద్దిలపాలెం: ఏయూలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి పలు సంస్థల్లోని ఉద్యోగ ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మోడల్ కెరీర్ సెంటర్ డిప్యూటీ చీఫ్ కె. దొరబాబు తెలిపారు. స్మార్ట్‌మీటర్ల ఇన్‌స్టలేషన్ రంగంలో 80 ఖాళీలు ఉన్నాయి. ఎలక్ట్రికల్ ఐటీఐ లేదా గ్రాడ్యుయేషన్ తోపాటు 2 ఏళ్ల అనుభవం ఉన్నవారు, 32 ఏళ్లలోపు వయసు గలవారు అర్హులు. ఎంపికైన వారికి నెలకు రూ.20,000 వేతనం లభిస్తుంది. ఐఫోన్ మ్యానుఫ్యాక్చరింగ్ విభాగంలో 60 ఖాళీలు ఉన్నాయి. ఇంటర్మీడియట్ అర్హతతోపాటు 26 ఏళ్లలోపు వయసు గలవారు అర్హులు. నెలకు రూ.18,700 వేతనం అందిస్తారు. డీమార్ట్‌లో 30 ఖాళీలకు ఇంటర్మీడియట్ అర్హతతోపాటు 25 ఏళ్లలోపు వయసు గలవారు అర్హులు. వీరికి నెలకు రూ.11,500 వేతనం ఉంటుంది.ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలో 50 ఖాళీలు అందుబాటులో ఉన్నాయి. 10వ తరగతి అర్హతతోపాటు 50 ఏళ్లలోపు వయసు గలవారు అర్హులు. నెలకు రూ. 16,000 వేతనం ఇవ్వనున్నారు.

వర్షంతో బురదమయం



కశింకోటలో వర్షానికి బురదమయంగా మారిన ఆర్టీసీ బస్ స్టేషన్

కశింకోట: మండలంలో మంగళవారం వర్షం కురిసింది. ముందు ఎక్కువగాను, తర్వాత నుంచి చిత్తడిగాను కురిసింది. దీంతో కశింకోట ఆర్టీసీ బస్ స్టేషన్ ఆవరణలో నీరు నిలిచి బురదమయంగా మారింది. ప్రయాణికులు బస్ స్టేషన్‌కు రావడానికి ఇబ్బంది పడ్డారు. రోడ్లు చిత్తడిగా మారడంతో ప్రజలు రాకపోకలు సాగించడానికి అవస్థలకు గురయ్యారు. తాళ్లపాలెంలో వర్షం పడటంతో జాతీయ రహదారిపై వాహన చోదకులు రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడ్డారు.

కల్యాణ వెంకన్న ఆలయంలో హోమాలు

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గత నెల 31 వ తేది నుంచి జరుగుతున్న వార్షిక కల్యాణోత్సవాలు బుధవారంతో ముగియనున్నట్టు ఆలయ ధర్మకర్త చైర్మన్ రాపేట రామకొండలరావు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా ప్రత్యేంగా హోమాది కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

రేషన్ డిపో ఏర్పాటుకు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఇరువాడ కాలనీ వాసులు

సబ్బవరం: మండలంలోని ఇరువాడలో గల ఎస్సీ కాలనీ, కుమ్మర కాలనీ, యాత కాలనీ వాసులకు అందుబాటులో ఉండే విధంగా రేషన్ డిపో ఏర్పాటు చేయాలని ఆయా కాలనీల వాసులు తహసీల్దార్ బి. చిన్నికృష్ణకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కొత్త ప్రభుత్వం ప్రవేశపెట్టిన రేషన్ డిపోలు ఈ మూడు కాలనీలకు 2 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయన్నారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ ఈ సమస్య ఆర్‌డీవో దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం చేస్తామని హమీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బలిరెడ్డి అప్పారావు, గ్రామ ఉప సర్పంచ్ బలిరెడ్డి సూర్యప్రసాద్, ఎస్సీ కాలనీ నాయకుడు పట్ల కృష్ణ, మూడు కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

సీఐఎస్ఎఫ్ సిబ్బంది జీతాల నిర్వహణపై ఎస్‌బీఐతో ఒప్పందం

ఉక్కునగరం: కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) సిబ్బంది జీతాల ఖాతాలను నిర్వహించేందుకు సీఐఎస్ఎఫ్‌తో ఎస్‌బీఐ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సీఐఎస్ఎఫ్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, పదవీ విరమణ పొందిన సిబ్బంది ఖాతాలను మూడేళ్ల పాటు నిర్వహించేలా ఒప్పందం జరిగింది. ఈ మేరకు సీఐఎస్ఎఫ్ తరపున అడ్మినిస్ట్రేషన్ డీఐజీ రేఖ నంబియార్, ఎస్‌బీఐ కార్పొరేట్ సెంటర్ జీఎం రంజన్ సిన్హాలు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ అవగాహన ఒప్పందం ప్రకారం సిబ్బందికి మెరుగైన ఆర్థిక ప్రయోజనాలను సమకూర్చడంతో పాటు సీఐఎస్ఎఫ్ సిబ్బంది కుటుంబ సభ్యుల సంక్షేమం, ఆర్థిక భద్రతకు దోహదపడతాయని స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ యూనిట్ వర్గాలు తెలిపారు. ఒప్పందం నియమాల ప్రకారం జీరో అక్కౌంట్ ఇవ్వడంతో పాటు రూ. 50 లక్షలు ప్రమాద బీమా (మరణ) కవరేజీ ఉంటుంది. వార్షిక నిర్వహణ చార్జీలు లేకుండా ఉచిత డెబిట్ కార్డు, ఎస్‌బీఐ ఏటీఎంలలో అపరిమిత ఉచిత లావాదేవీలు, ఇతర బ్యాంక్ ఏటీఎంలలో నెలకు 10 ఉచిత లావాదేవీలు, హర్షక లాకర్‌పై 10 శాతం రాయితీ ఉంటాయి. ఉచిత డిమాండ్ డ్రాఫ్టల జారీ ఉంటుంది. ఈ ఒప్పందం ద్వారా జవాన్లకు ఎస్‌బీఐ రిష్తే కుటుంబ పొదుపు ఖాతాను పరిచయం చేశారు. తద్వారా సిబ్బంది భాగస్వామి, పిల్లలు, తల్లిదండ్రులు, తోబుట్టువులు నాలుగు జీరో ఖాతాలు తెరవడానికి అవకాశం కల్పించారు. ఈ ప్రయోజనాలపై సీఐఎస్ఎఫ్ సిబ్బందికి అవగాహన కల్పించేందుకు ఎస్‌బీఐ సిబ్బంది ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఈదురుగాలులతో వర్షం



సత్యవరంలో ఈదురుగాలులలో కూడిన వర్షం కురుస్తున్న దృశ్యం

మాడుగుల : మండలంలో సత్యవరం, తాటిపర్తి, అవురువాడ గ్రామాల్లో మంగళవారం సాయంకాలం ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేల కొరిగాయి. గత 15 రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు, గాలులకు సుమారు 300 ఎకరాల్లో అపరాలు సాగు దెబ్బతిన్నాయి. ఒక వైపు ఖరీఫ్ సీజన్ రావడంతో వరి నారు మడులు సిద్ధం చేసుకోలేకపోతున్నామని, పచ్చి రొట్ట విత్తనాలు వేసుకోలేకపోతున్నామని, పలు గ్రామాలు రైతులు ఆవేదన చెందుతున్నారు.

మాడుగుల రూరల్: మృగశిర కార్తె ప్రవేశంతో మంగళవారం ఉదయం నుంచి ఆడపా దడపా వర్షం కురుస్తుంది. దీంతో వాతావరణం చల్లబడింది. అడపా దడపా కురుస్తున్న వర్షాలకు రైతులు ఖరీఫ్ పనులకు శ్రీకారం చుట్టారు. వరి నారు మడులు సిద్ధం చేస్తున్నారు.

వసతి గృహాల్లో దోమల నివారణకు చర్యలు

నక్కపల్లి: వసతి గృహాల్లో దోమల నివారణకు వైద్యారోగ్య శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. మంగళవారం గొడిచర్ల పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో నక్కపల్లిలో గురుకుల పాఠశాల, కేజీబీవీ, బీసీ వసతి గృహాల్లో దోమల నివారణకు స్ప్రేయింగ్ చేశారు. వేసవి సెలవులు ముగుస్తున్న నేపథ్యంలో విద్యార్థులు మలేరియా, వైరల్ జ్వరాలు, అతిసార, టైఫాయిడ్ వంటి వ్యాధులు బారిన పడకుండా స్ప్రే చేశామని వైద్యశాఖ సిబ్బంది చెప్పారు. వైద్యాధికారి సంధ్య, కిరణ్‌ప్రసాద్, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసరావు, హెచ్‌ఈ లక్ష్మణమూర్తి, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.